క్లుప్తంగా

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, గాంధీపురం – 3, శ్యామల నగర్, గోరక్షణపేట, శీలం నూకరాజు రోడ్డు, వేంకటేశ్వర జనరల్ మార్కెట్, సోమాలమ్మ పుంత రోడ్డు, డైమండ్ పార్క్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు అవార్డు

కంబాలచెరువు: గోదావరి ఇంజినీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందర్ప వెంకటరామ శ్రీనివాస్‌కు ఢిల్లీలో సౌత్ వెస్ట్రన్ అమెరికా ఈ నెల 24న యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ సైన్సెస్ అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు ఆయన ఆ వివరాలను సోమవారం తెలిపారు. ఏయూ నుంచి డాక్టర్ పీవీ రమణ పర్యవేక్షణలో ఆయన రాసిన 37 పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయంగా ప్రచురితమయ్యాయి. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రెండు పుస్తకాలు రాశారు.

ఎన్‌సీపీఐతో అనుసంధానం చేసుకోవాలి



కోట శేషారావు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే లబ్ధి నేరుగా సంబంధిత లబ్ధిదారుల ఖాతాలలో జమ కావాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో పోస్టల్ ఖాతాలను అనుసంధానం చేసుకోవాలని రాజమహేంద్రవరం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కోట శేషారావు అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ దీని కోసం వార్డు సచివాలయాల్లో పోస్టల్ సిబ్బంది శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఖాతాలు లేనివారికి పోస్టాఫీసుల్లో తెరచుకునే సదుపాయం ఉందన్నారు. కేవలం రూ.200కే ఖాతా తెరిచే అవకాశం ఉందన్నారు.

నిబంధనల మేరకు బదిలీలు చేపట్టాలి



జిల్లా రెవెన్యూ అధికారిని కలిసిన ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగులకు మేలు చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న బదిలీలను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి తామరల సీతారామమూర్తి కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఏడు తాలూకా యూనిట్లు, జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్స్ ఎన్నికల వివరాల రికార్డును అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విల్సన్ పాల్, సహాధ్యక్షుడు డీఎస్ చాంబర్లీన్, ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, నాయకుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

శాకా సోదరులకు పరామర్శ



శాకా పట్టాభి, ఆయన సోదరులను పరామర్శిస్తున్న ఆకుల వీర్రాజు

కడియం: పితృవియోగంతో బాధపడుతున్న శాకా పట్టాభి, ఆయన సోదరులను మాజీ డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. కడియంలో వారి స్వగృహంలో దివంగత శాకా సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బోనం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మెంటార్‌గా సుసత్య రేఖ



రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక జాతీయ మెంటరింగ్ మిషన్ నుంచి ఆహ్వానాన్ని అందుకున్నారు. భారత ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మానస పుత్రిక న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 20 – 20 వికసిత్ భారత్ 2047 అభియాన్‌లో భాగంగా ప్రతిష్టాత్మకమైన జాతీయ మెంటరింగ్ మిషన్ ఏర్పాటు చేసింది. జాతీయ స్థాయిలో బోధనా రంగంలో నూతన ఒరవడిని సృష్టించిన, సాంకేతిక రంగ నిపుణులైన ఉపాధ్యాయులను జాతీయ స్థాయిలో ఎంపిక చేసి ఒక బృందంగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగస్వాములు కావాలని మేకా సుసత్య రేఖను ఆహ్వానించారు. ఈ మేరకు జాతీయ ఉపాధ్యాయ మండలి, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో సుసత్య రేఖ జూన్ నుంచి ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

మురుగు పోయేదెలా..

- మూసుకుపోయిన తూరలు
- కార్తికేయనగర్ వాసుల అవస్థలు



కార్తికేయ నగర్‌లో తుప్పలతో మూసుకుపోయిన డ్రైనేజీ



మరో చిన్న డ్రైనేజీదీ అదే దుస్థితి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారి కింద ఉన్న తూరలు మూసుకుపోవడంతో కార్తికేయ నగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. దీనివల్ల డ్రైనేజీలలో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయి దోమలకు నిలయంగా మారింది. ఒక రోడ్డులో డ్రైనేజీ పూర్తిగా పచ్చని తుప్పలతో మూసుకుపోయినప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి సమీపంలో కార్తికేయ నగర్ ఉంది. ఇక్కడ ఎక్కువగా ఉద్యోగస్తులు నివసిస్తుంటారు. జాతీయ రహదారి పక్కగా ఉద్యోగానికి వెళ్లేందుకు అనువుగా ఉంటుందని లక్షల రూపాయలతో ఇళ్లు కొనుగోలు చేసుకున్నారు. ప్రతి ఏడాది పంచాయతీకి పన్నులు సైతం సక్రమంగా చెల్లిస్తుంటారు.

మెరుగుపరుస్తాం

హుకుంపేట వద్ద జాతీయ రహదారి కింద తూరలు మూసుకుపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లడం లేదు. దీనిపై కార్తికేయ నగర్ వాసులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయగానే ఆ తూరలను ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీతో కలిసి పరిశీలించాం. ఆ పూడికను మనుషులను పెట్టి తీయించాలి. వెంటనే ఎస్టిమేషన్ వేసి, తూరలలో పూడికను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం.

– జి.కాశీవిశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి, హుకుంపేట

కానీ పంచాయతీ నుంచి కనీస వసతులు సైతం సమకూరడం లేదు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది.

చెత్తాచెదారం

కార్తికేయ నగర్ నుంచి మురుగునీరు జాతీయ రహదారి కింద తూరల నుంచి ఆవకాలువలో కలుస్తుంది. ఆ తూరలు చెత్తాచెదారంతో మూసుకుపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ స్తంభించింది. దీనివల్ల డ్రైనేజీలలోని మురుగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో దుర్వాసన వెలువడడంతో పాటు దోమలకు నిలయంగా మారాయి. రాత్రి సమయాల్లో కార్తికేయ నగర్ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. వర్షం కురిస్తే చాలు రోడ్డు మీదకు మురుగునీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై కార్తికేయ నగర్ వాసులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం కాలేదు.



డ్రైనేజీలో ముందుకు కదలని మురుగునీరు

పీహెచ్‌డీకి ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ ఆఖరి సంవత్సరం చదువుతున్న బూలా వెంకట రాజు, దూనబోయిన సాద్విక, పేరాల శేఖర్.. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ఫుల్ టైం చేయడానికి అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి, ఆ తర్వాత ఇంటర్వ్యూలో ప్రతిభ చూపించి విజయం సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఉపకార వేతనంతో కూడిన ఫుల్ టైం పీహెచ్‌డీ చేయడానికి అర్హత పొందడం స్ఫూర్తిదాయకమని గణిత శాస్త్ర విభాగాధిపతి జి.చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. వారికి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పతకాలను బహూకరించి సత్కరించారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- త్వరలో వైఎస్సార్ సీపీ కమిటీల ఏర్పాటు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం .. ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం కడియం మండల పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల, గ్రామ, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీనిలో భాగంగానే మండలంలోని ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందని, అయితే కూటమి ప్రభుత్వంపై చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పూర్తికాకముందే పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకత ఏర్పడటం చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, నాయకులు ఈలి గోపాలం, కొండపల్లి పట్టియ్య, సాపిరెడ్డి సూరిబాబు, చింతపర్తి రాంబాబు, అయినవిల్లి వెంకటేశ్వరరావు, కట్టా జమిందార్, గుబ్బల నాగార్జున, బడుగు చిన్ని, విప్పర్తి ఫణి, పితాని హరికృష్ణ, చింతపర్తి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తరల్ శిక్షణకు ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక



తరల్ శిక్షణకు ఎంపికైన కృష్ణమోహన్, శ్రీనివాస్

కంబాలచెరువు: టీచింగ్ ఎట్ ద రైట్ లెవెల్ (తరల్) రాష్ట్రస్థాయి శిక్షణకు నగరంలోని ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన వరహాగిరి కృష్ణమోహన్, ధాన్యంపాకలు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల నుంచి నుంచి సిద్దనాతి శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్టు జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎ.గౌరీశంకరరావు సోమవారం తెలిపారు. వీరిద్దరూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఏలూరు జిల్లా అగిరిపల్లిలోని హీల్స్ పేరడైజ్ పాఠశాలలో 3, 4, 5 తరగతులకు సంబంధించిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు నిర్వహిస్తున్న తరల్ శిక్షణకు హాజరవుతారు. అనంతరం జిల్లాలలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వీరిద్దరినీ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, ఎంఈఓ ఎం.సుబ్రహ్మణ్యం అభినందించారు.

పోలీసుల పనితీరు హాస్యాస్పదం

రాజమహేంద్రవరం సిటీ: హత్య జరిగిన ఏడాది తర్వాత నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు తమ అసమర్థతను ప్రకటించుకున్నారని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ 2024 మే 29న హిందూపూర్‌లో ఎన్ఎస్‌యూఐ నేత సంపత్ కుమార్‌ను దారుణంగా నరికి చంపేశారన్నారు. ఆ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడాది తర్వాత నిందితులను అరెస్టు చేయడంతో పోలీసుల సామర్థ్యం ఏమిటో స్పష్టమవుతుందన్నారు. నిందితులకు రక్షణ కల్పించడంలో పోలీసులు ఎప్పటికప్పుడు తమదైన శైలిలో వ్యవహరిస్తూనే వచ్చారన్నారు. సంపత్ కుమార్‌ను హత్య చేసిన నిందితులకు పోలీసులు సకల సౌకర్యాలు కల్పించి ఏడాది తర్వాత అరెస్టు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పొగాకు సాగులో సుస్థిరతకు ప్రోత్సాహం



ఆవుల్ టెక్నో సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న ఐకార్-నిర్మా డైరెక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు సాగులో సుస్థిరతను ప్రోత్సహించేందుకు ఐకార్ – నిర్మా, ఆవుల్ టెక్నో మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని నిర్మా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. దీని ద్వారా సంప్రదాయ కలప ఆధారిత ఆరబెట్టే పద్ధతికి ప్రత్యామ్నాయంగా శక్తి పరిరక్షణ, పర్యావరణ అనుకూలత కలిగిన ఎలక్ట్రిక్ పద్ధతుల వైపు మారడానికి ముందడుగు పడనుందన్నారు. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) మోడల్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఆకులను ఆరబెట్టే ఎలక్ట్రిక్ హాట్ ఎయిర్ పంప్ రూపకల్పన, మౌలిక విశ్లేషణ, ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కలప వినియోగాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. ఇది భారతదేశ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ఆవుల్ టెక్నో సంస్థ పొగాకు పంటలో తక్కువ వ్యయం, అధిక విలువ కలిగిన పోస్ట్–హార్వెస్ట్ పరిష్కారాలను అందించేందుకు లాట్ ఆధారిత సాంకేతికతను సమన్వయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహం



ప్రవచనం చెబుతున్న సురేష్ దాస్ బ్రహ్మచారి

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక మార్గాన్ని చేరుకోవాలంటే భాగవతం చదవడం, వినడం చేయాలని భాగవతాభక్త శ్రీపాద సురేష్ దాస్ బ్రహ్మచారి అన్నారు. స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో మూడు రోజులుగా భాగవత సప్తాహం ప్రవచనం జరుగుతోంది. బ్రహ్మచారి మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భాగవత సప్తాహం ప్రవచనం జరుగుతుందన్నారు. భక్తులు ప్రవచాన్ని ఆలకించి, తిలకించి పునీతులు కావాలన్నారు.

కోవిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కోవిడ్ ఉధృతమవుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. కోవిడ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు ధరించాలన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్లో మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పేరుతో బెదిరింపులు

రాజమహేంద్రవరం రూరల్: పోలీసుల పేరుతో గేదెల లోడుతో వెళుతున్న వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించి, అతడి జేబులోని రూ.1000 దోచుకున్న సంఘటన దివాన్ చెరువు ఫారెస్టు ఏరియా సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా పెదమను పురానికి చెందిన కూరాడ శివరాజు హనుమాన్ జంక్షన్‌కు గేదెల లోడుతో వెళుతున్నాడు. దివాన్ చెరువు ఫారెస్టు ఏరియాకు వచ్చేసరికి ఇద్దరు వ్యక్తులు రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై వచ్చి పోలీసులమని చెప్పి వ్యాన్‌ను నిలుపుదల చేశారు. డ్రైవర్ జేబులోని రూ.1000 తీసుకుని, ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు పక్కనే ఆగి ఉన్న స్కూటీని బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిపై హుకుంపేట డీఎస్ఆర్ నగర్ వద్ద సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. డీఎస్ఆర్ నగర్‌కు చెందిన శ్రీనివాస్ తన పిల్లలైన ప్రియ, విహాస్‌లను స్కూటీపై బయటకు తీసుకు వచ్చాడు. డీఎస్ఆర్ నగర్ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చి, రోడ్డు పక్కగా స్కూటీని ఆపి పిల్లలను అక్కడే ఉంచి శ్రీనివాస్ మూత్రవిసర్జనకు వెళ్లాడు. ఈలోపు హుకుంపేట వైపు నుంచి బొమ్మూరు వైపు గేదెల లోడుతో వెళుతున్న బొలెరో వాహనం ఆ స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారులు దొర్లుకుని కిందపడిపోయారు. తీవ్ర గాయాలైన వారిని చికిత్స కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఎస్సై అంకారావు పరిశీలించారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి పిట్లవాని చెరువు సమీపంలో ఓ ఖాళీ స్థలంలో సోమవారం సాయంత్రం పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు బొమ్మూరు ఎస్సై అంకారావు తెలిపారు. వారి నుంచి రూ.3 వేలు, 52 పేకలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మన ఆరోగ్యం- మన బాధ్యత

- యోగాంధ్రలో స్వచ్ఛందంగా పాల్గొనాలి
- జేసీ చిన్న రాముడు



యోగాసనాలు వేస్తున్న జేసీ చిన్నరాముడు

సీటీఆర్ఐ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జూన్ 21న విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు విజ్ఞప్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డు మార్గంలో సోమవారం ప్రారంభమైన యోగాంధ్ర అభ్యాస జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయవచ్చన్నారు. ఈ నెల 26 నుంచి జూన్ 20 వరకూ ఇదే ప్రదేశంలో ప్రతి రోజూ యోగాభ్యాస తరగతులు నిర్వహిస్తామన్నారు. యోగా గురువు నాగేశ్వరరావు దిశానిర్దేశంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం: క్వారీ గోతుల్లో ప్రమాదాల నివారణకు యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఎలగాటి రమణ అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ క్వారీ గోతుల నీటిలో పడిపోయాడని, స్థానికులు గమనించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడన్నారు. క్వారీ గోతులు పూడ్చాలని చాలా కాలంగా ప్రజా పోరాటాలు, న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ ప్రశాంతి.. సుబ్బారావు నగర్, సింహాచల నగర్ ప్రాంతాల్లోని క్వారీ గోతుల వద్ద సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రాత్రిపూట లైటింగ్ ఏర్పాటు చేయాలని, సున్నంబట్టి లేఅవుట్ రోడ్డు వెడల్పు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. క్వారీ గోతుల్లోని నీటి కారణంగా దోమలు విపరీతంగా పెరిగాయని, తుప్పలు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వంగూరి విజయ సత్య, గార సత్యనారాయణ, గార అప్పారావు, శివకోటి దావీదు, యడ్ల ప్రసాద్, దడాల శివశంకర్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు శిక్షణ ఇవ్వాలి



కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

సీటీఆర్ఐ: నాయీ బ్రాహ్మణ యువతకు, మహిళలకు శిక్షణ ఇచ్చి, కులవృత్తిని ప్రోత్సహించి తమకు జీవనాధారం చూపించాలని నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కలెక్టర్ ప్రశాంతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, సంఘ నగర అధ్యక్షుడు కందికొండ అనంత్, సెక్రటరీ రాజాన సత్తిరాజు, ట్రెజరర్ ముక్కాల సందీప్, జాయింట్ సెక్రటరీ వై మధు తదితరులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఇటీవల స్పా సెలూన్ పేరుతో పెట్టిన సంస్థల్లో అనేక సంఘ వ్యతిరేక పనులు చేస్తున్నట్లు వార్తలు రావడం, వారిపై కేసులు కూడా నమోదు కావడం జరుగుతోందన్నారు. దీనివల్ల తమ గౌరవప్రదమైన క్షవరవృత్తికి చెడ్డ పేరు వస్తోందన్నారు. ముఖ్యంగా బార్బర్ షాపులకు అద్దెకు ఇవ్వడానికి ముందుకు రావడం లేదన్నారు.

కూటమి పాలనలో మహిళలకు భద్రత కరవు



మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని కలిసిన మార్తి లక్ష్మి తదితరులు

అనపర్తి : కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి అన్నారు. ఆమె సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మిని అభినందించారు. కూటమి ప్రభుత్వ దమనకాండను నిలువరించాలంటే మహిళా శక్తి కూడా పార్టీకి తోడవ్వాలన్నారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం నేతలు కొప్పోలు అనురాధ, కృష్ణవేణి, బొంతు మణి, పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ డైరెక్టర్ మార్తి నాగేశ్వరరావు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్ సత్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌పై దాడి

కంబాలచెరువు: తిలక్ రోడ్డులోని స్మార్ట్ బ్యూటీ సెలూన్‌పై ప్రకాశం నగర్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు మహిళలు, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిలక్ రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద సెలూన్ ముసుగులో స్పా నడుస్తోందని సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో దాడి చేయగా ముగ్గురు మహిళలు, ఇద్దరు వ్యక్తులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీంతో పాటు నిర్వాహకురాలిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.